పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



నల్లగొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న అధికారులు



నల్లగొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న పోలీసు సిబ్బంది

నల్లగొండ: నల్లగొండ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. నల్లగొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రవి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికే నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఓటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రితో పోలింగ్ సిబ్బంది బుధవారం వాహనాల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దివ్యాంగుల, వృద్ధుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో 5 మోడల్ పోలింగ్ స్టేషన్లు, మరో 5 ఉమెన్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఒకటి దివ్యాంగుల, మరోటి యూత్ మేనేజిడ్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోనున్న 244460 మంది ఓటర్లు

నల్లగొండ నియోజకవర్గంలో 2,44,460 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారితోపాటు 85 మంది సర్వీస్ ఓటర్లు కూడా ఉన్నారు.

ఎన్నికల విధుల్లో 1308 మంది సిబ్బంది

నల్లగొండ నియోజకవర్గంలో 284 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం 1308 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. మరో 172 మంది సిబ్బంది రిజర్వులో ఉన్నారు. కాగా 50 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధిలో 57 మంది అబ్జర్వర్లను నియమించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు 12

నల్లగొండ నియోజకవర్గంలో 12 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అందులో మోడల్ పోలింగ్ స్టేషన్లు నటరాజ్ థియేటర్ దగ్గర ఉన్న చెన్నకేశవ పోలింగ్ స్టేషన్, పట్టణంలోని బోయవాడ, కనగల్ మండలం బుడమర్లపల్లిలోని ఎంపీపీఎస్ పాఠశాల, అదే విధంగా మాడ్గులపల్లి మండలంలోని కొత్తగూడెం, తిప్పర్తి మండలం మర్రిగూడ ఎంపీపీఎస్ పాఠశాలలో మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఉమెన్ పోలింగ్ స్టేషన్లను నల్లగొండ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూ బిల్డింగ్, అక్కలాయిగూడెం, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజీ ఐడీసీ సెంటర్, ఎన్జీ జోసెఫ్ హైస్కూల్ పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేశారు. పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాన్ని సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్‌లో ఏర్పాటుచేయగా యూత్ పోలింగ్ స్టేషన్‌ను చర్లపల్లిలోని ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేశారు.

నకిరేకల్ నియోజకవర్గంలో..

నకిరేకల్ : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం అయ్యింది. నకిరేకల్ నియోజకవర్గంలో నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, రామన్నపేట, చిట్యాల మండలాల్లో గురువారం జరిగే శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నం 12 గంటల తరువాత బందోబస్తు మధ్య ఆర్టీసీ బస్సుల్లో ఈవీఎంలను తరలించారు. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,50,547 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,24,668 మహిళలు 1,25,876 మంది, ట్రాన్స్‌జెండర్ ముగ్గురు ఉన్నారు. మొత్తం పోలింగ్ స్టేషన్లు 305 ఏర్పాటు చేశారు. నకిరేకల్‌లో 61, రామన్నపేటలో 59, చిట్యాలలో 52, కట్టంగూరులో 40, కేతేపల్లిలో 35, నార్కట్‌పల్లిలో 61 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది, రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 1420 మందిని నియమించారు. 305 పోలింగ్ స్టేషన్‌లకు గాను 763 బ్యాలెట్ యూనిట్‌లు, 427 వీవీ ప్యాట్లు, 381 కంట్రోల్ యూనిట్లను వినియోగిస్తున్నారు. మొత్తం 29 కౌంటర్ల ద్వారా 305 పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలను తరలించారు.

29 రూట్లు విభజన

మొత్తంగా 29 సెక్టార్లు, 29 రూట్లుగా విభజించారు. పోలింగ్ సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు 29 ఆర్టీసీ బస్సులు, మినీ బస్సులు 22, మరో 33 ఇతర ప్రైవేటు వాహనాలను వినియోగిస్తున్నారు. నియోజకవర్గంలో 150 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. దివ్యాంగులను, వృద్ధులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు మొత్తం 100 వాహనాలు సమకూర్చారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు పోల్ చీటీల పంపిణీ పూర్తి చేశారు.

మునుగోడు నియోజకవర్గంలో..

చండూరు : మునుగోడు నియోజకవర్గంలో మొత్తం 2,52,648 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 12,62,223 మంది, మహిళలు 12,64,21 మంది, ఇతరులు నలుగురు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు మునుగోడు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.దామోదర్‌రావు తెలిపారు. చండూరు డాన్‌బాస్కో కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ నుంచి బుధవారం ఈవీఎంలను ఆర్‌ఓ ఎన్నికల సిబ్బందికి అందించారు. నియోజకవర్గంలో మొత్తం 307 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో మహిళా పోలింగ్ కేంద్రాలు 5, మోడల్ పోలింగ్ కేంద్రాలు 5, యూత్ పోలింగ్ కేంద్రం 1, దివ్యాంగుల పోలింగ్ కేంద్రం 1 ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఓ దామోదర్‌రావు తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో 112 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని 30 రూట్లుగా విభజించి ఒక్కో రూటుకు ఇద్దరు సెక్టార్ అధికారులను నియమించామన్నారు. 307 మంది పోలింగ్ అధికారులు, 307 మంది అదనపు పోలింగ్ అధికారులు, 614 మంది ఓపీఓలు వీరితోపాటు 71 మంది అధికారులు సూక్ష్మ పరిశీలకులుగా విధులు నిర్వహించనున్నారు. 55 సమస్యాత్మక కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 1000 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. వీరితోపాటు 700 మంది పారామిలటరీ పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు శాంతిభద్రతలు పర్యవేక్షించనున్నారు.

క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు

చిట్యాల : శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, నేరడ, గుండ్రాంపల్లి గ్రామాలను తీవ్ర సమస్యాత్మకగా గ్రామాలుగా గుర్తించారు. నేరడ, చిన్నకాపర్తి, ఎలికట్టె, వట్టిమర్తి, తాళ్ళవెల్లెంల గ్రామాలను సమ్యాస్యాత్మక గ్రామాలుగా అధికారులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఆయా గ్రామాల్లో పోలీసు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలతో గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



గట్టుప్పల్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్

చండూరు(గట్టుప్పల్) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మునుగోడు నియోజకవర్గంలో 12 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మహిళా పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గంలోని చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గట్టుప్పల్ గ్రామపంచాయతీ కార్యాలయం, నారాయణపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చండూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లకినేనిగూడెం, నాంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేటలో ఏర్పాటు చేశారు. యూత్ పోలింగ్ కేంద్రాన్ని చండూర్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాలను చౌటుప్పల్ మండలంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల బీసీ కాలనీ, నారాయణపురం మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మునుగోడు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోటయ్యగూడెం, మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించేవారికే ఓటు

నూతన ఓటర్ల మనోగతం

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



గత పదేళ్ల నుంచి నిరుద్యోగం పెరిగింది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. నా మొదటి ఓటు నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపే అభ్యర్థికే వేయబోతున్నాను. నా కుటుంబ సభ్యులతోపాటు పలువురికి ఈ విషయంపై అవగాహన కల్పించాను. యువత నేడు ఆలోచించే వేస్తే ఓటు రేపటి భవిష్యత్‌కు పునాది కానుంది.

– సిలివేరు నగేష్, మర్రిగూడ

ప్రజా సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తాం



ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులకే ఓటు వేస్తాను. నాకు ఈ సంవత్సరమే కొత్తగా ఓటుహక్కు వచ్చింది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు ఎవరెవరో వచ్చి ఏమేమో చెప్పుతుండేవారు. కానీ ఇప్పుడు వారు ఏం చెబుతున్నారో తెలుస్తోంది. మన కష్ట సుఖాలను తెలుసుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ ప్రజల కోసం కష్టపడే నాయకుడికి ఓటు వేస్తాం.

– జంపాల ప్రవీణ్, మార్కెట్‌కాలనీ, శాలిగౌరారం

నిజాయితీ గల నాయకులకే ఓటు వేస్తాం



నాకు ఈ సంవత్సరమే కొత్తగా ఓటుహక్కు వచ్చింది. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునేందుకు నిజాయితీ గల నాయకులకే ఓటు వేస్తాను. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు పేదలకు అందేవిధంగా చర్యలు చేపట్టాలి.

– బుడిగె దివ్య, శాలిగౌరారం

ప్రజా సేవ చేసేవారికే నా మొదటి ఓటు



ప్రజా సేవ చేసేవారికే నా మొట్టమొదటి ఓటు వేస్తాను. ప్రస్తుతం ఉన్న అభ్యర్థుల్లో వారి గుణగణాలు తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకుంటాను. దేశ భవిష్యత్ రాజకీయ నాయకుల చేతిలో ఉంటుంది. అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు.. ఏపాటి వాడో చూసి ఓటు వేస్తాము.

– మండలి స్వామి, శాబ్దుల్లాపురం

తొలిసారి ఓటు వేయబోతున్నా



నేను తొలిసారిగా ఓటు వేయబోతున్నా. గ్రామంతోపాటు నియోజకవర్గం అభివృద్ధిని చేసే అభ్యర్థికే ఓటు వేయబోతున్నాను. మునుగోడులో ఒక పార్టీ గెలిస్తే రాష్ట్రంలో మరోపార్టీ అధికారంలో ఉండడం జరుగుతూ ఉండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు చెబుతున్నారు. అభివృద్ధి చెందేందుకు మార్పు కోరుకుంటున్నా.

–లవంగి సంధ్య, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ

భవిష్యత్ నాయకుడిని ఎన్నుకోవాలి



మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. నిష్పక్షపాతంగా పాలించే నాయకుడిని ఎన్నుకోవాలి. భవిష్యత్ నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత యువతదే.

– స్నేహ బొడ్డుపల్లి, జంగారెడ్డిగూడెం, తిప్పర్తి మండలం

నిస్వార్థంగా పనిచేసే వారిని ఎన్నుకుంటా..



నాకు ఈ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. నాకు వచ్చిన ఓటును సద్వినియోగం చేసుకుంటా. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసి, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తికి ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎన్నుకుంటాను.

– ఏర్పుల నితిన్, చిట్యాల

ప్రజా సేవకులను ఎన్నుకోవాలి



నాకు మొదటిసారి ఓటు హక్కు వచ్చింది. బీటెక్ నాలుగో సంవత్సరం ఇటీవలే పూర్తి చేసుకున్నాను. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిది. మన ఓటుతో నీతి నిజాయితీ గల ప్రజా సేవకులను ఎన్నుకోవాలి. నేను హైదరాబాద్‌లో ఉంటున్నా.. ఓటు హక్కు వినియోగించుకోవడానికి మా గ్రామానికి వచ్చాను. ప్రతిఒక్కరూ ఓటు వేసి తమకు నచ్చిన వారిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది.

– యశ్వంత్ రెడ్డి, కంచనపల్లి, నల్లగొండ మండలం

ఓటు వజ్రాయుధం



ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉంటుంది. ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారు. ఓటుకు నోటు వ్యవస్థ సమాజ నాశనానికి నాంది. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సరిదైన వ్యక్తిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యం. మనం వేసే ఓటు మన భవిష్యత్‌కు దారి. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి.

– వి.అచ్యుత్‌సాయి, డాక్టర్స్ కాలనీ నకిరేకల్

ప్రజాస్వామ్య మనుగడకు ఓటే పునాది



ప్రజాస్వామ్య మనుగడకు ఓటే పునాది. అలాంటి ఓటును మొదటిసారి వినియోగించుకోబతున్నా. ప్రజాస్వామ్యానికి ఓటు అనేది ఆయుధం. కానీ రాజకీయ పార్టీలు ఓటును అంగడి సరుకుగా మార్చాయి. యువతను రాజకీయ నాయకులు ప్రలోభాలకు గురిచేయకుండా స్వేచ్ఛగా వేసే అవకాశం కల్పించాలని అని కోరుకుంటున్నా. ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు కోల్పోతాం.

– చనగాని సౌమ్య, పర్వతగిరి

సంతోషంగా ఉంది



నాకు తొలిసారి ఓటు హక్కు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు మంచి ప్రజాసేవ చేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం నాకు లభించింది.నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి. నిజాయితీతో పరిపాలించాలి.

– ఆడెపు భువనేశ్వరీ, నాంపల్లి

తొలిసారి అవకాశం వచ్చింది



నాకు ఓటు వేసేందుకు తొలిసారిగా హక్కు వచ్చినందుకు సంతోషంగా ఉంది. మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం కలిగింది. ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రజల కష్టాలు ఎప్పటికప్పుడు తీర్చాలి. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలి.

– కామనబోయిన శివ, నాంపల్లి

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. స్త్రీలు 14869, పురుషులు 14331 కలిపి మొత్తం 29200 ఓటర్లు ఉన్నారు. ఎస్‌ఐ ఎన్.ధర్మా మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

కట్టంగూర్ : అసెంబ్లీ ఎన్నికలకు కట్టంగూర్ మండల వ్యాప్తంగా ఉన్న 40 పోలింగు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్, మండల ఎన్నికల అధికారి డి స్వప్న తెలిపారు. బుధవారం కట్టంగూర్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది, ఈవీఎం, వీవీప్యాట్ పరికరాలతో బస్సుల్లో బుధవారం సాయంత్రం అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని అన్నారు. గురువారం ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నార్కట్‌పల్లి : పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. నార్కట్‌పల్లి మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు, 5 రూట్‌లు, 37 పోలింగ్ లోకేషన్‌లు ఉన్నాయని అన్నారు. ఒక డీఎస్పీ, ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, 130 మంది పోలిస్ సిబ్బంది, కేంద్ర బలగాలు 60 మంది నార్కట్‌పల్లి మండలంలో విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

నార్కట్‌పల్లి మండలంలో 42,609 ఓట్లు

నార్కట్‌పల్లి మండలంలో 42,609 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. అందులో పురుషులు 21,101, స్త్రీలు 21,507, ఇతరులు ఒక ఓటు ఉన్నట్లు తెలిపారు. మండలంలో పోలింగ్ కేంద్రాలు 58 ఉండగా అందులో 18 కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు గురించామన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రం, మండల కేంద్రంలోని యూపీఎస్‌లో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

మునుగోడు: నియోజకవర్గంలో గురువారం నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 26 గ్రామాల్లో 44 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో నలుగురు సిబ్బంది చొప్పున నియమించి బుధవారం సాయంత్రం చండూరు నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఈవీఎంలతో పాటు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున కానిస్టేబుళ్లు, ప్రతి రూట్‌కు ఒక మొబైల్ టీమ్‌తో పాటు ప్రత్యేక బలగాలను నియమించారు.



తిప్పర్తి బాలుర హైస్కూల్లో బ్యాలెట్ బాక్స్‌లతో వస్తున్న ఎన్నికల సిబ్బంది



శాలిగౌరారంలో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది



మునుగోడులో..

కేతేపల్లిలో

కేతేపల్లి : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సిబ్బంది మండలంలోని ఆయా గ్రామాలకు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయితీల్లో 30,470 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు 35 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఇతర సామగ్రితో పోలీసు బందోబస్తు నడుమ సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ. శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చిట్యాల: చిట్యాల మండలంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకుగాను అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 46,831 మంది ఓటర్లు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకోనున్నారు. వీరిలో 23,358 మంది పురుషులు, 23,473 మంది మహిళా ఓటర్లున్నారు. చిట్యాల మున్సిపాలిటీతో పాటు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మొత్తంగా 52 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

శాలిగౌరారం : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం అధికారులు ఓటింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. శాలిగౌరారం మండలంలోని 24 గ్రామపంచాయతీలు ఉండగా మొత్తం 52 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 39386 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 19642, స్త్రీలు 19741, ఇతరులు ముగ్గురు ఓటర్లు ఉన్నారు. బుధవారం సాయంత్రానికే సంబంధిత ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 520 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో 114 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. బుధవారం 33 ఈవీఎం మిషన్లతో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 18 గ్రామపంచాయతీల్లో 29,580 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 14,661, స్త్రీలు 14,919 మంది ఉన్నారని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బక్క శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా నాంపల్లి సీఐ ఎ.నవీన్‌కుమార్, ఎస్‌ఐ కె.రంగారెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నాంపల్లిలో..

నాంపల్లి : నాంపల్లి మండలంలోని 46 బూత్‌లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి దేవ్‌సింగ్ బుధవారం తెలిపారు. 46 బూత్‌లలో పీఓలు, ఏపీఓలు కలిసి 92 మంది, 92 మంది అసిస్టెంట్ అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. 83 మంది సెంట్రల్ ఫోర్స్ పోలీస్ సిబ్బందితో ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



కట్టంగూర్ హైస్కూల్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది



మర్రిగూడలో పోలింగ్ ఏర్పాట్లలో సిబ్బంది

ఎన్‌పీఎస్‌లో ఓటు వేయనున్న కోమటిరెడ్డి

నల్లగొండ : కాంగ్రెస్ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టణంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్ (ఎన్‌పీఎస్) పోలింగ్ కేంద్రంలో ఓటు వేయనున్నారు. ఆయనతో పాటు సతీమణి సబిత, కూతురు శ్రీనిధిరెడ్డి కూడా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చౌటుప్పల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఓటు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

పాఠశాల భవనం నిర్మాణానికి మోక్షమెప్పుడు!



నకిరేకల్‌లోని చీమలగడ్డలో పాఠశాల భవనం కూల్చివేసిన ప్రాంతం



కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న విద్యా బోధన

- హైవే విస్తరణలో చీమలగడ్డ పాఠశాల కూల్చివేత
- రాజీవ్ విద్యామిషన్ నుంచి అప్పట్లో రూ.9.40 లక్షలు మంజూరు
- భవనం నిర్మించకపోవడంతో నిధులు వెనక్కి

నకిరేకల్ : జాతీయ రహదారి విస్తరణ అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు శాపంలా మారాయి. మంజూరైన నిధులు కూడా వెనక్కి మళ్లిపోయాయి. హైదరాబాద్ – విజయవాడ హైవే నంబర్ 65 విస్తరణలో భాగంగా నకిరేకల్‌లోని చీమలగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పూర్తిగా తొలగించారు. దీంతో ఆ పాఠశాల విద్యార్థుల విద్యాభ్యాసం 12 ఏళ్లుగా కమ్యూనిటీ భవనంలో, చెట్ల కింద సాగుతోంది.

2011 సంవత్సరంలో పాఠశాల భవనం తొలగింపు

బైపాస్ విస్తరణలో భాగంగా నకిరేకల్‌లోని చీమలగడ్డ ప్రాథమిక పాఠశాల భవనాన్ని 2011 జనవరి మాసంలో పూర్తిగా తొలగించారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 40 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రసుతం ఈ పాఠశాల విద్యాబోధన స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతోంది. ఈ పాఠశాల భవనం రోడ్డు విస్తరణలో కోల్పోవడంతో నష్ట పరిహారం కింద రూ.3 లక్షల నిధులను ప్రభుత్వం మండల పరిషత్‌కు అప్పట్లో అందజేసింది. రాజీవ్ విద్యా మిషన్ నుంచి రూ.9.40 లక్షలు విడుదలయ్యాయి. మొత్తం 12.40 లక్షలు మంజూరయ్యాయి. అయితే బైపాస్ విస్తరణ పూర్తయ్యి తొమ్మిదేళ్లు దాటినా ఇంకా పాఠశాల భవనానికి మాత్రం మోక్షం కలగడం లేదు. పాఠశాల భవనం నిర్మాణానికి స్థలం కేటాయించకపోవడం, భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో రాజీవ్ విద్యామిషన్ నుంచి మంజూరైన రూ.9.40లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కేవలం జీఎమ్మార్ సంస్థ వారిచ్చిన రూ.3 లక్షలు మాత్రమే ఎంపీడీఓ ఖాతాలో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల భవనాన్ని నిర్మించాలి



నకిరేకల్‌లోని బైపాస్ విస్తరణలో 12 ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా కూల్చివేశారు. 12 సంవత్సరాల నుంచి చీమలగడ్డలోని కమ్యూనిటీ హాల్‌లోనే తరగతులను నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నాం.

– పోతుల భూపాల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, చీమలగడ్డ